క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలోని 33/11 కేవీ ఉప కేంద్రం మరమ్మతుల కారణంగా నేడు (శనివారం)ఉదయం 8 గంటల నుంచి 9.30 నిమిషాల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉటుందని విద్యుత్ శాఖ డీఈ నాగేశ్వర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అబ్బాపూర్, కాశిందేవిపేట, ములుగు, పందికుంట, పస్రా, తాడ్వాయి, ధర్మవరం, రామన్నగూడెం, ఏటూర్, అలుబాక, వెంకటాపురం(ఎం), గోవిందరావుపేట, వెల్తుర్లపల్లి ఉప కేంద్రాల పరిధిలో అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

నియామకం



ములుగు రూరల్: బీఆర్‌ఎస్ పార్టీ కొత్తూరు గ్రామ కమిటీ నూతన అధ్యక్షుడిగా అడ్డూరి రాజును ఎన్నుకున్నట్లు మాజీ ఎంపీటీసీ మాషిపెద్ది సత్యనారాయణరావు శుక్రవారం తెలిపారు. ఉపాధ్యక్షుడిగా అక్కల పోశాలు, ప్రధాన కార్యదర్శిగా ఇండ్ల అశోక్, కార్యదర్శిగా అక్కల మాధవులు, కోశాధికారిగా కంచ కృష్ణ, ప్రచార కార్యదర్శిగా కస్తూరి సురేష్, కార్యవర్గ సభ్యులుగా బండి రమేశ్, కోరె రాజు, దొమ్మటి మల్లయ్య, తక్కల్లపల్లి కిషన్‌రావు, అమ్మ కుమార్, మండల నరేందర్, గౌరవ అధ్యక్షులుగా తక్కళ్లపల్లి దేవేందర్‌రావు, సామ కృష్ణారెడ్డిని నియమించారు.

డైరీ ఆవిష్కరణ



ములుగు: ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్(టీడబ్ల్యూజేఏ)2025 సంవత్సర డైరీని శుక్రవారం జిల్లాకేంద్రంలో ఆర్‌అండ్ బీ గెస్ట్ హౌజ్‌లో మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ వెంకట్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు బానోత్ వెంకన్న, గౌరవ అధ్యక్షుడు భూక్య సునీల్, జిల్లా కార్యదర్శి ముకులోత్ శరత్, సభ్యులు బానోత్ యోగి, కేతిరి భిక్షపతి, డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్, మల్లాడి రాంరెడ్డి, ఇర్సవడ్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

క్షమాపణ చెప్పాలి

మంగపేట: ఆదివాసీలను రాజకీయంగా అనిచివేయాలనే దోరణితో రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యను విమర్శించిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మైలజయరాంరెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆదివాసీసేన మండల అధ్యక్షుడు పోలెబోయిన ఆదినారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆదివాసీ గిరిజన రైతు ఆత్మహత్య చేసుకుంటే బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పరామర్శించిన విషయంలో పొదెం వీరయ్యను విమర్శించిన జయరాంరెడ్డికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష పదవిని పొదెం వీరయ్య పెట్టిన భిక్షే మర్చి పోయావా అని ప్రశ్నించారు.

'ప్రశ్నించడంలో తప్పేమీలేదు'

మంగపేట: మండలంలోని మొట్లగూడెంలో ఆత్మహత్యకు పాల్పడిన రైతు నర్సింహారావు కుటుంబాన్ని పరామర్శించిన పొదెం వీరయ్య స్థానిక కాంగ్రెస్ నాయకులకు సమాచారం ఇవ్వకుండా బీఆర్‌ఎస్ నాయకులతో వెళ్లడాన్ని మండల అధ్యక్షుడి హోదాలో జయరాంరెడ్డి ప్రశ్నించడంలో తప్పేమీలేదని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి యానయ్య శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. జయరాంరెడ్డిని విమర్శిస్తున్న సంఘాల నాయకులు ఎమ్మెల్యేగా ఆదివాసీ ఆడబిడ్డ సీతక్కపై పలువురు విమర్శలు చేసినప్పుడు ఎందుకు ప్రశ్నించలేదన్నారు.

చెట్లు దగ్ధం

చిట్యాల: మండలంలోని గుంటూరుపల్లి గ్రామానికి చెందిన పాలెపు మాధవికి సంబంధించిన ఎర్ర చందనం, శ్రీగంధం, జామ తోట, అందులో ఉన్న డ్రిప్పుపైపులు దగ్ధమైన విషయం శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలు పాలెపు మాధవిరాంబాబు తెలిపిన ప్రకారం ముచినిపర్తి శివారులో ఎకరం ఇరవై గుంటల వ్యవసాయ భూమిలో ఆరు సంవత్సరాల క్రితం ఎర్ర చందనం, శ్రీగంధం, జామ తోట మొక్కలను నాటమని తెలిపారు. అనంతరం వృత్తి రిత్యా హైదరాబాద్‌లో ఉంటున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు తన సొంత గ్రామమైన గుంటూరుపల్లికు శుక్రవారం వచ్చి వెళ్తున్న క్రమంలో ఎర్ర చందనం, శ్రీగంధం, జామ తోట, డ్రిప్పు పైపులు కాలిపోయినట్లు స్థానికులు సమాచారం ఇచ్చారని తెలిపారు. ఈ సంఘటనపై ఆరా తీయగా ఇటీవల ఈదురుగాలులతో వర్ష కురిసిన సమయంలో ప్రమాదవశాత్తు పక్క చేనులో ఉన్న విద్యుత్ స్తంభం వైర్లు తెగిపడి చెట్లతో పాటు డ్రిప్పు పైపులకు నిప్పు అంటుకుని కాలిపోయినట్లు తెలిసిందన్నారు. సుమారు రూ.15 లక్షలు నష్టం వాటిల్లిందని విద్యుత్ అధికారులు తమకు న్యాయం చేయాలని కోరారు.

'ఉపాధి' కోసం పడిగాపులు

- ప్రారంభం కాని ఉపాధిహామీ పనులు
- నష్టపోతున్న కూలీలు
- అవగాహన కల్పించని అధికారులు



ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

ఎస్‌ఎస్‌తాడ్వాయి: మండల కేంద్రంలోని తాడ్వాయి గ్రామస్తులు ఉపాధి హామీ పనుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రతీ ఏటా మార్చి నుంచి మే చివరి వరకు కూలీలకు పనులను కల్పిస్తారు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఉపాధి పని కల్పించిన దఖాలాలు లేవు. దీంతో కులీలు పనులు లేక ఆర్థికంగా నష్టపోతున్నారు. వచ్చే నెల మొదటి వారం నుంచి తూనికాకు సేకరణ ప్రారంభమవుతుంది. గ్రామంలోని ప్రజలు తూనికాకు సేకరణకు వెళ్తుంటారు. దీంతో ఈసారి తాడ్వాయి గ్రామస్తులకు ఉపాధి పనులు లేనట్లే అన్నట్లుగా ఉంది. ఉపాధి పనులపై కూలీలకు అవగాహన కల్పించి పనులు కల్పించాల్సిన ఈజీఎస్ అధికారులు ఇప్పటి వరకు పని కల్పించలేదని కూలీలు వాపోతున్నారు. కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని కూలీల సంఖ్య కూడా పెంచాలని సంబంధిత జిల్లా అధికారులు టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఆదేశాలు జారీ చేసిన పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రంలోని నర్సింగాపూర్, ఇందిరానగర్, తాడ్వాయి ఎస్టీ కాలనీలోని కూలీలకు పని కల్పించిన అనుకున్న స్థాయిలో కూలీల సంఖ్య పెరగడం లేదని తెలుస్తుంది. ఉపాధి పనుల్లో ఫిల్డ్ అసిస్టెంట్లు అవకతవకలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పనుల ప్రదేశాలను పరిశీలిస్తే అవకతవకల విషయాలు వెలుగులోకి రానున్నాయి.

పని కల్పించలేదు



ఈ ఏడాదిలో ఇప్పటి వరకు ఉపాధిహామీ పని కల్పించలేదు. ఉపాధి పనులకు వెళ్లాలని చూస్తున్నాం. ఉపాధి పనులకు వెళ్తే రైతు ఆత్మీయ భరోసా కూడా వర్తిస్తుంది. ఉపాధి పనులపై కనీసం సమాచారం కూడా ఇవ్వడం లేదు. డిమాండ్ పెట్టమని చెప్పారు కానీ పని కల్పించలేదు. అధికారులు స్పందించి పనులు కల్పించాలి.

– బంగారు మానస, తాడ్వాయి కూలీ

ఉపాధి పని కల్పించాలి



ఉపాధి పనులు కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. ఉపాధి పనులు కల్పించడం వలన ప్రభుత్వం నుంచే అందించే ఆత్మీయ భరోసా లభిస్తుంది. గతేడాది మార్చి నుంచే పని కల్పించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పని కల్పించాలి.

– గట్టు అనిత, తాడ్వాయి

మంత్రి పొంగులేటికి ఘన స్వాగతం



మంత్రులు పొంగులేటి, సీతక్కను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

ములుగు: భూభారతి చట్టం అమలులో భాగంగా పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన వెంకటాపురం(ఎం) మండల కేంద్రంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు రాష్ట్ర రెవెన్యూ, పౌర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ప్రత్యేక చాపర్ ద్వారా ఉదయం 11.40 గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో లాండ్ అయిన పొంగులేటికి మంత్రి డాక్టర్ సీతక్క పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ టీఎస్ దివాకర, డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, గ్రంథాలయ చైర్మన్ బానోతు రవిచందర్ స్వాగతం పలికారు. ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ నుంచి భారీ ద్విచక్ర వాహనాల ర్యాలీతో నాయకులు ఘన స్వాగతం పలికారు. నాయకులు జాతీయ రహదారిపై మజీద్ సమీపంలో మంత్రులు పొంగులేటి, సీతక్కకు భారీ గజమాలతో సన్మానించారు. జిల్లా కేంద్రం నుంచి వెంకటాపురం మండల కేంద్రం వరకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ర్యాలీ కొనసాగింది.

గీత కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న గీత కార్మికులు

గోవిందరావుపేట: నిజామాబాద్ జిల్లా తాళ్లరాంపూర్‌లో గీత కార్మికులను సాంఘిక బహిష్కరణ చేసిన వారిని శిక్షించాలని మండలంలో పస్రాలో కల్లు గీత కార్మిక సంఘం సొసైటీ మండల అధ్యక్షుడు జక్కు రాజు గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. గీతకార్మికులను సాంఘిక బహిష్కరణ చేసి శ్రీరామనవమి రోజు గుడిలోకి వచ్చిన మహిళలను గెంటేసి అవమానపరిచి ఈత చెట్లను తగలబెట్టిన వీడీసీ కమిటీ సభ్యులను తక్షణమే అరెస్టు చేసి శిక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జక్కు వేణు, జక్కు మొగిళి, కక్కెర్ల శ్రీనివాస్, మేరుగు సుధాకర్, గిరిజన సంఘం జిల్లా నాయకులు బాలరాజు, జక్కు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి

- బీజేపీ రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యుడు బుచ్చయ్య



మాట్లాడుతున్న పల్లా బుచ్చయ్య

ఏటూరునాగారం: నష్టపోయిన వరి, మిర్చి రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యుడు పల్లా బుచ్చయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జిల్లాలో కురిసిన అకాల వర్షాలు, వడగండ్ల వర్షంతో ఆయా గ్రామాల్లో వరి, మిర్చి దెబ్బతిని రైతులు నష్టపోయారన్నారు. అధికారులు సర్వే చేసి నష్టపోయిన రైతులకు వరి పంటకు ఎకరానికి రూ.30వేలు, మిర్చికి ఎకరానికి రూ.50వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా పని చేస్తున్నటువంటి సీతక్క రైతుల పక్షాన నిలబడి రైతులకు పరిహారం అందించే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వినుకోలు చక్రవర్తి, జిల్లా కౌన్సిల్ మెంబర్ గద్దల హరిబాబు, మాజీ ఎంపీటీసీ మండల నాయకులు ఎర్రల్ల ఎల్లయ్య, నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల అరెస్ట్



పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకులు

వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలో నిర్వహించే రెవెన్యూ సదస్సుకు ముగ్గురు మంత్రులు హాజరుకానున్న నేపథ్యంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏదైనా కార్యక్రమాలు నిర్వహిస్తారని బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. అరెస్టు అయిన వారిలో నాయకులు గంగుల రాజ్‌కుమార్, కన్నెబోయిన వీరేందర్, వినోద్, నాగరాజు ఉన్నారు.

యువకుడి అదృశ్యం

వెంకటాపురం(కె): మండల కేంద్రానికి చెందిన చిడెం సాయి ప్రకాశ్ అనే యువకుడు అదృశ్యమయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. సాయి ప్రకాశ్ ఈ నెల 15న హనుమకొండ కారు కిరాయికి వెళ్లి ఇప్పటి వరకు ఇంటికి తిరిగి రాలేదు. దీంతో అతడి కుటుంబ సభ్యులు బంధువుల ఇంట్లో వెతికిన ఆచూకీ తెలియలేదు. దీంతో సాయి ప్రకాశ్ తమ్ముడు సాయితేజా శుక్రవారం హనుమకొండలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

పెట్రోల్ బంకుల వద్ద అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

ఏటూరునాగారం: పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు, పనిచేసే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఫైర్‌మెన్ రవికుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నబోయిపల్లి పెట్రోల్ బంక్ వద్ద అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా అవగాహన కల్పించారు. పెట్రోల్ ఫిల్లింగ్ చేసే క్రమంలో సెల్‌ఫోన్ మాట్లాడటం, అగ్గిపెట్టె, లైటర్ ఉపయోగించొద్దన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఫైర్ ఎక్స్‌టింగ్విషర్స్ ఉపయోగించి నివారించాలన్నారు. అలాగే వెంటనే 101, 8712685772కు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో భార్గవ్, శ్రీకాంత్, అనిల్, రాజు పాల్గొన్నారు.

చెత్త తొలగింపు



చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

వాజేడు: మండల కేంద్రంలో సంత నిర్వహించే ప్రదేశంలో శుక్రవారం నాగారం పంచాయతీ సిబ్బంది చెత్తను తొలగిచారు. పరిసరాలను శుభ్రపర్చారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



రేగొండ: పరామర్శిస్తున్న కీర్తిరెడ్డి




కాటారం: పరామర్శిస్తున్న పుట్ట మధు

రేగొండ: మండలంలోని రాయపల్లి గ్రామానికి చెందిన దాసరి లచ్చమ్మ ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఆమె వెంట పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశిధర్‌రెడ్డి, నాయకులు దాసరి తిరుపతిరెడ్డి, సయ్యద్ గాలిఫ్, పెండ్యాల రాజు, శోభన్, విష్ణు, కిషన్‌రావు , గణేష్, ఎర్ర రాకేష్‌రెడ్డితో పాటు తదితరులు ఉన్నారు.

కాటారం: మండలంలోని ప్రతాపగిరికి చెందిన దండెవేన శ్రీనివాస్ ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు శుక్రవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి శ్రీనివాస్ మృతిపై ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట మండల ఇన్‌చార్జ్ జోడు శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, నాయకులు ఊర వెంకటేశ్వరరావు, పంతకాని సద్మలి, తదితరులు ఉన్నారు.

గట్టమ్మ ఆలయం వద్ద మంత్రి సురేఖకు స్వాగతం



ములుగు రూరల్: మంత్రి కొండ సురేఖకు గట్టమ్మ ఆలయం వద్ద కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. శుక్రవారం ములుగు జిల్లాలోని వెంకటాపురం మడంల కేంద్రంలో భూ భారతి ప్రారంభోత్సవ కార్యక్రమానికి వస్తున్న మంత్రి కొడా సురేఖను కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ గట్టమ్మ ఆలయం వద్ద శాలువాలతో సన్మానించి ఆహ్వానించారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు



రాంనగర్‌లో బెల్లం పానకంతో పోలీసులు

గోవిందరావుపేట: మండలంలోని పాపయ్యపల్లి, రాంనగర్, మాన్యతండా గ్రామాల్లో పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై శుక్రవారం దాడులు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సమాచారం మేరకు రాంనగర్, మాన్యతండా, పాపయ్య పల్లి గ్రామాల్లో సిబ్బందితో కలిసి నాటు సారా తయారీ కేంద్రాలపై విస్తృతంగా దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈదాడుల్లో 25 లీటర్ల నాటు సారా, 500 లీటర్ల బెల్లం పానకం స్వాధీనం చేసుకొని నలుగురిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. నాటుసారా తయారు చేసిన, విక్రయించిన చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

చట్టాలను నిర్వీర్యం చేస్తున్న అధికారులు

- గోండ్వానా సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్



మాట్లాడుతున్న ప్రతాప్

వెంకటాపురం(కె): ఏజెన్సీలో ఆదివాసీ చట్టాలను అధికారులు నిర్వీర్యం చేస్తున్నారని గోండ్వానా సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్ ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో గోండ్వానా సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ చట్టాలకు వ్యతిరేకంగా ప్రభుత్వ భూముల్లో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని అన్నారు. ఏజెన్సీలో ఎల్‌టీఆర్, 1/70 చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కోరారు. మండలంలో బహుళ అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్న అధికారులు పట్టించుకోవటం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇర్ప అరుణ్ కుమార్, కోరం బన్నీ, పూనెం రవి కిరణ్, అశోక్, సాయి తదితరులు ఉన్నారు.

అమలుకు నోచుకోని ఏజెన్సీ చట్టాలు



మాట్లాడుతున్న ఉయిక శంకర్ దొర

వాజేడు: ప్రభుత్వాలు, పాలకులు మారినా ఏజెన్సీ చట్టాలు అమలుకు నోచుకోవడం లేదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు ఉయిక శంకర్ దొర ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని చంద్రుపట్ల, పెద గంగారం గ్రామాల్లోని ఆదివాసీలతో ప్రత్యేక సమావేశమై మాట్లాడారు. పాలక ప్రభుత్వాలు ఏజెన్సీ ప్రాంతం నుంచి నీళ్ల, నిధులు, నియామకాలను తరలించుకు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంపదను దోచుకునే పనిలో ఉన్న శ్రద్ధ ఆదివాసీలను అభివృద్ధి చేయడంపై ప్రభుత్వాలకు ఉండటం లేదని ఆరోపించారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

మొగుళ్లపల్లి: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో అకాల వర్షం కారణంగా నష్టపోయిన పంటలను శుక్రవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. ఈదురు గాలులతో కురిసిన వడగండ్ల వానకు వరి, మామిడి, మొక్కజొన్న అరటి, మిర్చి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. రైతులపై ఏమాత్రం ప్రేమ ఉన్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు వెంటనే స్పందించి అకాల వర్షాలతో నష్టపోయిన పంటలను సర్వే చేయించి పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు ఇప్పించేలా, తెలంగాణలో ఫసల్ బీమా యోజన అమలయ్యేలా సీఎం రేవంత్ రెడ్డిని ఒప్పించాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉండి వినతిపత్రాలు ఇస్తే ప్రజలకు ఒరిగేదేమీ లేదన్నారు. దేశవ్యాప్తంగా బీమా యోజన అమలవుతుంటే, తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. దీంతో అకాల వర్షాలకు..ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మోరె వేణుగోపాల్ రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ మోరె రవీందర్‌రెడ్డి, జిల్లా నాయకులు అన్నమానేని భూమారావు, బలుగూరి రాజేశ్వరరావు, లోకులబోయిన తిరుపతి, వైనాల ప్రియాంక శివకుమార్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



108 వాహనంలో క్షతగాత్రులు

వాజేడు: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని గుమ్మడి దొడ్డి గ్రామం వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవదూల గ్రామానికి చెందిన భాస్కర్ పేరూరు వైపు నుంచి వస్తుండగా అక్కడే ఉన్న వెంకటాపురం(కె) మండల పరిధిలోని ఎస్సీ మర్రి గూడెం గ్రామానికి చెందిన కోగిల అశ్విని జగన్నాథపురం గ్రామం వరకు లిఫ్ట్ అడగటంతో ద్విచక్ర వాహనంపై తీసుకువస్తున్నాడు. ఈ క్రమంలో గుమ్మడిదొడ్డి గ్రామం వద్దకు రాగానే ఛతీస్‌గఢ్ వెపునకు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో ఇద్దరు కింద పడి పోవడంతో అశ్వినికి తీవ్ర గాయాలు కాగా, భాస్కర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రులను ఏటూరునాగారం ఏరియా వైద్య శాలకు వైద్యం నిమిత్తం తరలించారు. ఇద్దరు కింద పడి పోయినప్పటికీ ఢీ కొట్టిన వారు ఆపకుండా వెళ్లిపోయినట్లు బొలేరా వాహనమని స్థానికులు తెలుపుతున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత



చిట్యాల: సెల్‌ఫోన్లు అందజేస్తున్న సీఐ, ఎస్సై



మొగుళ్లపల్లిలో..

చిట్యాల: మండలంలోని జూకల్ గ్రామానికి చెందిన సిరిగిరి రవీందర్, మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లికి చెందిన ఉప్పుల రవీందర్ సెల్ ఫోన్లను ఇటీవల పోగొట్టుకున్నాడు. దీంతో పోలీస్ స్టేషన్‌లో గతంలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితులకు శుక్రవారం సీఐ మల్లేశ్, ఎస్సై శ్రావన్‌కుమార్‌ల చేతుల మీదుగా అందజేశారు. సెల్‌ఫోన్లను గుర్తించడంలో సహాయపడిన కానిస్టేబుల్ లాల్‌సింగ్‌ను వారు అభినందించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. కొన్ని రోజులుగా సైబర్ నేరాలు పెరుగుతున్నాయని అన్నారు. వేసవి సెలవుల్లో పిల్లలకి సెల్‌ఫోన్ ఇచ్చే ముందు చైల్డ్ మోడ్ ఆన్ చేసి ఇవ్వాలని అన్నారు. ఆధునాధ టెక్నాలజీ ఏఐని వాడి ఫొటోలని మార్ఫింగ్ చేస్తున్నారని తెలిపారు. కావున పర్సనల్ ఫొటోలు సోషల్ మీడియాలో పెట్టవద్దని అన్నారు. ఎవరైనా సైబర్‌క్రైమ్‌కు గురైతే వెంటనే 1930 కు కాల్ చేయాలని పేర్కొన్నారు.

పిడిసిల్లలో..

మొగుళ్లపల్లి: మండలంలోని పిడిసిల్ల గ్రామానికి చెందిన గైకాడి నరేష్ సెల్‌ఫోన్ శుక్రవారం పోవడంతో వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. స్పందించిన పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బాధితుడికి ఎస్సై అశోక్ సెల్‌ఫోన్ అందజేశారు.